ప్రతీ మహిళ శక్తి స్వరూపమే..

మహిళలు శక్తి స్వరూపమని, ప్రపంచాన్ని మార్చగల శక్తి వారికే ఉందని వక్తలు పేర్కొన్నారు. అన్ని రంగాల్లో అద్వితీయ ప్రతిభను చాటుతూ దూసుకుపోతుందన్నారు. కాస్త ప్రోత్సాహాన్ని అందిస్తే ఆమె సాధించలేని విజయాలే లేవని, ప్రతీ ఇంట్లో వారికి తగిన గుర్తింపునివ్వాలని సూచించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా బుధవారం వాడవాడలా ఘనంగా వేడుకలు నిర్వహించారు. విభిన్న రంగాల్లో ప్రతిభ కనబరిచిన అతివలను ఘనంగా సత్కరించారు. పలు ఆటల పోటీలు నిర్వహించారు. వివిధ సంస్థల ఆధ్వర్యంలో స్త్రీమూర్తులను సత్కరించి, జ్ఞాపికలను అందజేశారు.

- ప్రపంచాన్ని మార్చే శక్తి ఆమె సొంతం
- ప్రోత్సహిస్తే సాధించలేని విజయాలే లేవు
- పునరుద్ఘాటించిన వక్తలు
- వాడవాడలా మహిళా దినోత్సవం



వివిధ రంగాల్లో రాణిస్తున్న మహిళలను సత్కరిస్తున్న డాక్టర్ ప్రమీల



72వ వార్డు వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మహిళలకు సత్కారం

గాజువాక /పెదగంట్యాడ: మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. వారి శక్తిని గుర్తించి ప్రోత్సహించాలని కోరారు. దిశ వెల్ఫేర్ ఫౌండేషన్ అధ్యక్షురాలు మంత్రి మంజుల ఆధ్వర్యంలో వికాస్‌నగర్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన మహిళా దినోత్సవ ప్రత్యేక కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మహిళా సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక పథకాలను అమలు చేస్తున్నారన్నారు. ఆ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం పలువురు మహిళలను ఆయన ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు తిప్పల వంశీరెడ్డి, మహ్మద్ ఇమ్రాన్, వైఎస్సార్ సీపీ 76వ వార్డు అధ్యక్షుడు దొడ్డి రమణ, డీసీఎంఎస్ చైర్మన్ పల్లా చినతల్లి, వైఎస్సార్ సీపీ నాయకురాలు పేడాడ రమణికుమారి, డాక్టర్ హేమలత, రోజారాణి, సీతామహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అతివలకు ఆటల పోటీలు

జీవీఎంసీ యూసీడీ విభాగం ఆధ్వర్యంలో స్వయం సహాయక సంఘాల సభ్యులకు ఆటల పోటీలను నిర్వహించారు. మ్యూజికల్ చైర్, పాటలు, డ్యాన్స్‌లు, ముగ్గుల పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో యూసీడీ విభాగం సహాయ ప్రాజెక్టు డైరెక్టర్ సంతోష్ కుమార్, జిల్లా మిషన్ సమన్వయకర్త నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

టీఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో..

డీసీఎంఎస్ చైర్‌పర్సన్ పల్లా చినతల్లి ఆధ్వర్యంలో స్థానిక బీసీ రోడ్డులోని టీఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన వేడుకల్లో ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో ప్రమీల, అండిబోయిన లక్ష్మి, మంత్రి మంజుల, ఈశ్వరి, సూర్య, అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు సత్కారం

మహిళా దినోత్సవాన్ని 72వ వార్డు వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. త్రిశక్తి మహిళా సంఘం, 72వ వార్డు వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం అధ్యక్షురాలు ధనలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి చేతులమీదుగా వివిధ రంగాలకు చెందిన మహిళలను సత్కరించారు. వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి సిరట్ల శ్రీనివాస్, నాయకులు నిర్మల, దీప్తి, నాగమణి, విజయ, భవాని, అనుపమ, ఉరుకూటి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

అదానీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో..

అదానీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో దిబ్బపాలెం పాఠశాల ఆవరణలో నిర్వహించిన వేడుకలకు హాజరైన విశాఖ జిల్లా దిశ పోలీస్‌స్టేషన్ కౌన్సెలర్ మాధవీ గణపతి మహిళల చట్టాలపై అవగాహన కల్పించారు. ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహిళలకు కుట్టు శిక్షణ ఇస్తామని చెప్పారు. కార్యక్రమంలో అచ్యుతరావు, రమేష్, వాణి, కృష్ణవేణి పాల్గొన్నారు.

అహింసా పిరమిడ్ ధ్యాన కేంద్రం ఆధ్వర్యంలో..

అహింసా పిరమిడ్ ధ్యాన కేంద్రం ఆధ్వర్యంలో మీసాల శివ గణేశ్వరరావు అధ్యక్షతన పెదగంట్యాడ కమ్యూనిటీ వెల్ఫేర్ సెంటర్‌లో మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కోలాటం, చిన్నారుల నృత్య ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. అనంతరం పలువురు మహిళలను సత్కరించారు. ఈ కార్యక్రమంలో టి.రేవతీదేవి, మమత, వనిత, పద్మావతి, డాక్టర్ భాగ్యగౌరి, శారద, భాను తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్‌లో..

కేఎన్నార్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక లయన్స్ క్లబ్‌లో నిర్వహించిన వేడుకల్లో వివిధ రంగాల్లో ప్రతిభ చూపిన మహిళలను రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నర్సింహారావు చేతులమీదుగా సత్కరించారు. ఆయన మాట్లాడుతూ మహిళలు శక్తివంతులని, వారిలోని నైపుణ్యాన్ని గుర్తించి ప్రోత్సహించాలని కోరారు. కార్యక్రమంలో ఫౌండేషన్ చైర్మన్ కరణం రెడ్డి నర్సింగరావు, ప్రతినిధులు సుహాసిని, కరణం రెడ్డి జ్యోతి, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

- స్థానిక రవీంద్ర ఇండియన్ స్కూల్‌లో మహిళా దినోత్సవం సందర్భంగా పాఠశాలలో పని చేస్తున్న ఆయాలను సత్కరించారు. వారి సేవలను కొనియాడారు. పాఠశాల కరస్పాండెంట్ నూకరత్నం, ప్రిన్సిపాల్ ఎస్‌వీకే పరశురామ్, ఉపాధ్యాయులు తులసి, కిరణ్మయి, సుజాత తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక స్వావలంబన అవసరం

అగనంపూడి: మహిళలు స్వశక్తితో ఎదుగుతూ, ఆర్థిక స్వావలంబన దిశగా అడుగులు వేయాలని సివిల్ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ ప్రమీల అన్నారు. 85వ వార్డు అగనంపూడి నిర్వాసిత కాలనీలోని పాఠశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా కేక్ కట్ చేశారు. ఆమె మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో పోటీపడి ముందు వరుసలో ఉన్నా, ఆర్థికంగా నిలదొక్కుకున్ననాడే మరింత రాణింపు ఉంటుందన్నారు. మహిళలు చిన్నపాటి విషయాలకు మనస్థాపానికి గురవడం వల్ల ఒరిగేదేమీ ఉండదని, పట్టుదలతో సవాళ్లను ఎదుర్కోవాలని సూచించారు. కార్యక్రమంలో అగనంపూడిలో వైద్య సేవలు అందిస్తున్న లక్కరాజు చెల్లయ్యమ్మతో పాటు వివిధ పాఠశాలల ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో బి.సత్యనారాయణ, చంద్రమౌళి, సంపంగి రంగారావు, సుప్రియ తదితరులు పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో అద్వితీయ ప్రతిభ

కూర్మన్నపాలెం: మహిళలు అన్ని రంగాల్లో అద్వితీయ ప్రతిభ చూపుతున్నారని స్టీల్‌ప్లాంట్ హ్యూమన్ రిసోర్స్ జోనల్ ఇంచార్జ్ డాక్టర్ రాధిక అన్నారు. కాస్త ప్రోత్సాహం అందిస్తే ఏదైనా సాధించగలరన్నారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆమెను ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు బొండా తౌడన్న, ప్రధాన కార్యదర్శి బయ్యే మల్లయ్య, ఇంటక్ చీఫ్ వైస్ ప్రెసిడెంట్ కొమ్ము ప్రసాదరావు, తాండ్ర కనకరాజు, డీజీఎం సత్యనారాయణ, ఏజీఎం జితేంద్ర తదితరులు పాల్గొన్నారు.



జీవీఎంసీలో మ్యూజికల్ చైర్ పోటీల్లో పాల్గొన్న మహిళలు



డాక్టర్ రాధికను సత్కరిస్తున్న స్టీల్‌ప్లాంట్ ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ ప్రతినిధులు



పేడాడ రమణకుమారిని సత్కరిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి



కేఎన్నార్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ..



మహిళలను సత్కరిస్తున్న అహింస పిరమిడ్ ధ్యాన కేంద్రం ప్రతినిధులు

క్లుప్తంగా

మంత్రి మూర్తి మృతి కార్మిక లోకానికి తీరని లోటు



మంత్రి మూర్తి చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి అమర్‌నాథ్

పెదగంట్యాడ: విశాఖ స్టీల్‌ప్లాంట్ ఐఎన్‌టీయూసీ కార్మిక నాయకునిగా మంత్రి మూర్తి అందించిన సేవలు మరువలేమని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. మంత్రి మూర్తి ఇటీవల మృతి చెందడంతో, ఆయన కుటుంబ సభ్యులను మంత్రి అమర్‌నాథ్ బుధవారం పరామర్శించారు. మూర్తి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మంత్రి మాట్లాడుతూ మూర్తి అకాల మరణం కార్మిక లోకానికి తీరని లోటన్నారు. కార్యక్రమంలో మంత్రి రాజశేఖర్, మంత్రి శంకరనారాయణ తదితరులు పాల్గొన్నారు.

శ్మశానవాటికలో అభివృద్ధి పనుల పరిశీలన



శ్మశానవాటికలో లైట్ల ఏర్పాటుపై ఏఈ భీమరాజుతో మాట్లాడుతున్న లతీష్

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 68వ వార్డు మిందిలో శ్మశానవాటిక అభివృద్ధి పనులను వైఎస్సార్ సీపీ వార్డు ఇన్‌చార్జి గుడివాడ లతీష్ పరిశీలించారు. శ్మశానవాటికలో లైట్ల ఏర్పాటుపై మింది విద్యుత్ సబ్ స్టేషన్ ఏఈ భీమరాజుతో చర్చించారు. రూ.58 లక్షల వ్యయంతో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు లతీష్ తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు ఈటి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు వైద్య పరీక్షలు



మహిళను పరీక్షిస్తున్న వైద్యురాలు

గాజువాక : మహిళా దినోత్సవం సందర్భంగా జీవీఎంసీ అధికారులు గాజువాకలో మహిళలకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. యూసీడీ విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో మహిళలకు బీపీ, సుగర్ తదితర వైద్య పరీక్షలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో యూసీడీ విభాగం ఏపీడీ సంతోష్ కుమార్, డిస్ట్రిక్ట్ మిషన్ కో ఆర్డినేటర్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కిడ్నీలను పదిలంగా కాపాడుకోవాలి



డాక్టర్ రమ్య వేదుల

అక్కిరెడ్డిపాలెం: మానవ శరీరంలో కిడ్నీలు ముఖ్యమైనవని, వీటిని సంరక్షించడంలో చాలా జాగ్రత్తలు పాటించాలని షీలానగర్ కిమ్స్ ఐకాన్ కన్సల్టెంట్ నెఫ్రాలజిస్ట్ , ట్రాన్స్‌ప్లాంట్ ఫిజీషియన్ డాక్టర్ రమ్య వేదుల అన్నారు. మార్చి 9న అంతర్జాతీయ కిడ్నీ దినోత్సవాన్ని పురస్కరించుకుని కిమ్స్ ఐకాన్ ఆస్పత్రిలో బుధవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. మూత్రపిండాలు ఆరోగ్యంగా ఉండాలంటే తీసుకోవల్సిన జాగ్రత్తలు తెలిపారు.

భక్తులకు అన్నసమారాధన

పెదగంట్యాడ: జీవీఎంసీ 74వ వార్డు పరిధి దయాల్‌నగర్ క్వారీ రోడ్డులో వేంచేసియున్న స్వర్ణ నూకాంబిక అమ్మవారి ఆలయ 20వ వార్షికోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి, కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. హోమంలో పాల్గొన్నారు. మధ్యాహ్నం ఏర్పాటు చేసిన అన్న సమారాధన కార్యక్రమాన్ని ప్రారంభించి, భక్తులకు అన్న ప్రసాదం వడ్డించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

వర్ణ హేల

- ఉత్సాహంగా హోలీ పండగ
- రంగులలో మునిగి తేలిన యువత



సెలెస్ట్‌లో రెయిన్ డ్యాన్స్‌లో పాల్గొన్న మహిళలు



అక్కిరెడ్డిపాలెంలో హోలీ సందడి

అక్కిరెడ్డిపాలెం: రంగుల పండగ హోలీని అంతటా ఆనందోత్సాహాలతో జరుపుకొన్నారు. చిన్న, పెద్ద తారతమ్యం లేకుండా రంగులు చల్లుకుంటూ ఆనందంగా గడిపారు. రంగుల ప్రపంచంలో మునిగి తేలారు.

- జీవీఎంసీ 68, 69 వార్డుల పరిధిలోని అక్కిరెడ్డిపాలెం, నాతయ్యపాలెం, షీలానగర్, మింది, భెల్ టౌన్‌షిప్, తుంగ్లాం, హరిజనజగ్గయ్యపాలెం, చుక్కవానిపాలెం తదితర ప్రాంతాల్లో యువకులు, చిన్నారులు, యువతులు హోలీని సంబరంగా జరుపుకొన్నారు. రంగులను చల్లుతూ.. కోడిగుడ్లు విసురుతూ ఆటపాటల్లో మునిగి తేలారు.

సెలెస్ట్‌లో హోలీ సంబరాలు

గాజువాక : పాతగాజువాకలోని సెలెస్ట్ గేటెడ్ కమ్యూనిటీలో హోలీ సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవంలో పెద్దలు, పిల్లలు ఉత్సాహంగా పాల్గొన్నారు. సెలెస్ట్ కల్చరల్ టీమ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రెయిన్ డ్యాన్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అనంతరం ఒకరిపై ఒకరు రంగులు జల్లుకొని హోలీ శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. కార్యక్రమంలో సెలెస్ట్ అసోసియేషన్, కల్చరల్ టీమ్ సభ్యులు సింగంపల్లి దేముడు, దిలీప్ షెకావత్, లక్ష్మీనారాయణ, పద్మజ, కోమలి, ఆనంద్, రవిశంకర్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మర్యాదపూర్వక కలయిక



అమర్‌నాథ్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్న మారుతీ ప్రసాద్

అక్కిరెడ్డిపాలెం: మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌ను వైఎస్సార్ సీపీ సాంస్కృతిక విభాగం అనకాపల్లి, విశాఖ, విజయనగరం జిల్లాల కో–ఆర్డినేటర్‌గా నియమితులైన వంకాయల మారుతీ ప్రసాద్ బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. మిందిలోని మంత్రి స్వగృహంలో కలిసి, ఆయన్ను సత్కరించారు. తనకు ఈ పదవి రావడానికి సహకరించిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం రేపు

అక్కిరెడ్డిపాలెం: ఈపీడీసీఎల్ జోన్ – 2 కణితిరోడ్డు 11 కేవీ ఫీడర్ పరిధిలో 33/11 కేవీ బీహెచ్‌పీవీ సబ్ స్టేషన్‌లో విద్యుత్ నిర్వహణ పనుల కారణంగా సంబంధిత ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని జోన్–2 ఈఈ బి.కె.నాయుడు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కారణంగా పంతులుగారి మేడ, చట్టివానిపాలెం, చిట్టినాయుడు కాలనీ ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని పేర్కొన్నారు.

ఉద్యమం మరింత ఉధృతం



755వ రోజు దీక్షలో పాల్గొన్న కార్మికులు

కూర్మన్నపాలెం: కేంద్ర ప్రభుత్వం కార్మికులు చేస్తున్న ఉద్యమానికి ఎన్నో ఒత్తిళ్లు, మరెన్నో అడ్డంకులు సృష్టించినా ఉక్కు సంకల్పం ముందు నిలబడలేవని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. పైగా రెట్టించిన ఉత్సాహంతో ఉద్యమం ఉధృతం చేస్తున్నారన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద నిర్వహిస్తున్న ఉక్కు రిలే నిరాహార దీక్షలు బుధవారం నాటికి 755వ రోజుకు చేరుకున్నాయి. దీక్ష శిబిరంలో బ్లాస్ ఫర్నేస్ విభాగానికి చెందిన కార్మికులు కూర్చున్నారు. విశాఖ ఉక్కును ప్రభుత్వరంగంలోనే కొనసాగిస్తామని కేంద్రం ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. ఎంతో గొప్ప చరిత్ర కలిగిన స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరిస్తే ఒప్పుకోబోమన్నారు. దీక్షలో నాయకులు పాల్గొన్నారు.

నాటి ఉద్యమం.. నేటి తరానికి స్ఫూర్తి



జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద దీక్షలో పాల్గొన్న కాంట్రాక్ట్ లేబర్ యూనియన్ నాయకులు

సీతమ్మధార : విశాఖ ఉక్కు–ఆంధ్రుల హక్కు అనే నినాదం నేపథ్యంగా జరిగిన నాటి ఉక్కు ఉద్యమం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని ఐఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి కె.ఈశ్వరరావు అన్నారు. విశాఖ ఉక్కును విక్రయించరాదని డిమాండ్ చేస్తూ అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన నిరాహార దీక్ష 704వ రోజు దీక్షలో కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొన్నారు. ఈశ్వరరావు మాట్లాడుతూ రైతులు సాగించిన పోరాట ఫలితంగా మోదీ ప్రభుత్వం మూడు వ్యవసాయ చట్టాలను వెనక్కి తీసుకుందని, స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు అటువంటి పోరాటాలు చేయక తప్ప దన్నారు. ఉక్కు నిర్వాసితులు చేసిన ప్రాణత్యాగాలను మోదీ ప్రభుత్వం గుర్తు చేసుకోవాలన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని కేంద్ర ప్రభుత్వం, ప్రధాని మోదీ ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ హెచ్‌పీసీఎల్ కాంట్రాక్ట్ లేబర్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

సుధాకర్ గెలుపుతో ఉత్తరాంధ్ర అభివృద్ధి



అగనంపూడి నిర్వాసితకాలనీల్లో ప్రచారం చేస్తున్న మహాలక్ష్మినాయుడు



65వ వార్డులో ప్రచారంలో పాల్గొన్న కార్పొరేటర్ మూర్తి



పట్టభద్రులను ఓటు అభ్యర్థిస్తున్న దొడ్డి రమణ



ఓటర్లకు కరపత్రాలను అందిస్తున్న టీడీపీ నాయకులు

అగనంపూడి: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం ముమ్మరంగా సాగుతోంది. వైఎస్సార్‌సీపీ బలపరిచిన సీతంరాజు సుధాకర్‌ను గెలిపించాలని కోరుతూ 79వ వార్డు గళ్లవానిపాలెం, శనివాడల్లో పార్టీ వార్డు ఇన్‌చార్జి అప్పికొండ మహాలక్ష్మినాయుడు, మండల కో–ఆర్డినేటర్ వాడపల్లి రామచంద్రరాజు ఆధ్వర్యంలో ప్రచారం చేశారు. నాయకులు జెర్రిపోతుల సమర, మామిడి శ్రీను, లక్ష్మి ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

- టీడీపీ మద్దతు అభ్యర్థి వేపాడ చిరంజీవిని గెలిపించాలని కోరుతూ 79వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ప్రచారం చేశారు. అగనంపూడి కాలనీల్లో ఓటర్లను కలిసి ఓటు కోరారు. కార్యక్రమంలో కర్రి దశేంద్ర, డి.సుబ్బరాజు, బి.సూర్య, కె.సత్యారావు, బి.సత్యనారాయణ, ఎస్.సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

65వ వార్డులో ..

గాజువాక : వైఎస్సార్‌సీపీ మద్దతుతో ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్న సీతంరాజు సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరుతూ 65వ వార్డు కార్పొరేటర్ బొడ్డు నర్సింహపాత్రుడు బుధవారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. రాజీవ్‌మార్గ్, భానోజీ కాలనీలో పట్టభద్రుల ఓటర్ల ఇళ్లకు వెళ్లి కరపత్రాలను పంపిణీ చేస్తూ ఓటు వేసే విధానాన్ని వివరించారు. ఉత్తరాంధ్రపై పూర్తి అవగాహన ఉన్న సీతంరాజును గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు పెద్దింటి మంగునాయుడు, జుత్తు లక్ష్మి, గొల్లపల్లి రాంబాబు, పెంద్ర రాజు తదితరులు పాల్గొన్నారు.

పెదగంట్యాడ: సీతంరాజు సుధాకర్‌ను గెలిపించాలని కోరుతూ వైఎస్సార్ సీపీ 76వ వార్డు అధ్యక్షుడు దొడ్డి రమణ బాలచెరువు తదితర ప్రాంతాల్లో బుధవారం జోరుగా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా తొలి ప్రాధాన్య ఓటును వైఎస్సార్‌సీపీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కు వేయాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో పరంకుశం ప్రమీల, నరసింహమూర్తి, రేవతి, కాకినాడ పెంటారావు, మురళి తదితరులు పాల్గొన్నారు.

- 75వ వార్డు వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు గొందేశి శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో పెదగంట్యాడ జంక్షన్‌లో జోరుగా ప్రచారం చేశారు. మార్టుపూడి పరదేశి, వెంకటేష్, పిట్టా రెడ్డి, సూర్యప్రకాష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో..

టీడీపీ నాయకుడు పులి వెంకటరమణారెడ్డి ఆధ్వర్యంలో ఆ పార్టీ బలపర్చిన అభ్యర్థి డాక్టర్ వేపాడ చిరంజీవిరావును గెలిపించాలని కోరుతూ 75వ వార్డు పరిధి సీతానగరంలో ప్రచారం చేశారు.

87వ వార్డులో..

కూర్మన్నపాలెం: సీతంరాజు సుధాకర్‌కు మద్దతుగా 87వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ కోమటి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వార్డు పరిధిలోని తిరుమలనగర్, సిద్ధార్థనగర్, శ్రీరామనగర్, పాత వడ్లపూడి తదితర ప్రాంతాల్లో ఉన్న ఓటర్లను కలిసి ఓటు అభ్యర్థించారు. కరపత్రాలను అందజేశారు.

- సీతంరాజు సుధాకర్‌కు మద్దతుగా బొడ్డ గోవింద్ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వార్డులోని పలు ప్రాంతాల్లో పట్టభద్రులైన ఓటర్లను కలిసి కరపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఎన్నేటి రమణ, చిత్రాడ వెంకటరమణ, పిన్నింటి సంతోష్, చిత్రాడ రాజు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ ప్రచారం

తెలుగుదేశం పార్టీ బలపరిచిన ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వేపాడ చిరంజీవిరావుకు మద్దతుగా 87వ వార్డు కార్పొరేటర్ బొండా జగన్ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వార్డులోని లక్ష్మీపురం కాలనీలో ఇంటింటి ప్రచారం చేశారు. విజయరామరాజు, రాజన్‌రాజు, కొల్లేపల్లి శ్రీనివాసవర్మ, కె. శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పైడిమాంబ ఘటాల ఊరేగింపు



అమ్మవారి ఘటాలను వీధుల్లో ఊరేగిస్తున్న ఆలయ కమిటీ

పెదగంట్యాడ: జీవీఎంసీ 76వ వార్డు పరిధి నడుపూరు గ్రామ దేవత పైడిమాంబ అమ్మవారి ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు బుధవారం అమ్మవారి ఘటాలను గ్రామ వీధుల్లో ఊరేగించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు మునగపాక అచ్చింనాయుడు, మంత్రి శంకరనారాయణ ఆధ్వర్యంలో వారంరోజుల పాటు ఈ వేడుకలను నిర్వహించనున్నారు. ప్రతి రోజూ వేమువజాము నుంచే అమ్మవారికి విశేష పూజలు, కుంకుమార్చనలు చేస్తున్నారు. ఈ నెల 14న ప్రధాన పండగ నిర్వహించనున్నారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మి ఆలయంలో ఆయుష్ హోమం

డాబాగార్డెన్స్: కనకమహాలక్ష్మి దేవస్థానంలో బుధవారం అమ్మవారి జన్మ నక్షత్రం పురస్కరించుకుని ఆయుష్ హోమం జరిపారు. ఉదయం 9 గంటలకు నిర్వహించిన పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నా రు. ప్రతి నెలా ఉత్తరా నక్షత్రం రోజు నిర్వహించే ఆయుష్ హోమంలో పాల్గొనదలిచే భక్తులు రూ. 2,516 పూజా రుసుం చెల్లించి పూజలో పాల్గొనవచ్చని ఆలయ ఈవో కె. శిరీష తెలిపారు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నెంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్0806081లో చెల్లించి, ఆన్‌లైన్ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేసిన వారు వివరాలు, పూజ జరిపించాల్సిన వారి పేరు, గోత్రనామాలు, పూర్తి చిరునామా, ఫోన్ నంబరును 8985515989 వాట్సప్ నెంబరుకు పంపవచ్చు.